భార్య శశికి పసుపూ కుంకుమాయిచ్చి, పూలూ పండ్లూ సంచిలో పెట్టింది. తెల్లవారేలోగా బండి కదలాలి అన్నాడు స్నేహితుడు.

శశి బండి ఎక్కింది. వచ్చేయేడొచ్చేటప్పుడు 'ఏం తెస్తావొదినా' స్నేహితుడిభార్య శశిని అడిగింది. ఏం తెమ్మంటావమ్మా? శశి సన్నగా అడిగింది. "నాకో కోడలు కావాలిసుమా వచ్చేయేడు వచ్చేటప్పుడు ఎత్తుకొని రావాలి," అంది చంద్రరావు స్నేహితుడిభార్య పకపక నవ్వుతూ.

బండెక్కుతూ చంద్రరావు కొంటెగా నవ్వాడు. శశి చురచురచూసింది. బండి కదలింది. పొలిమేరదాకా స్నేహితుడు బండివెనకనే నడిచాడు.

మర్రోజు వూళ్ళో గుప్పుమంది శశి లేచిపోయిందని. శశి తల్లికీ లక్ష్మిదేవికీ, చంద్రరావు స్నేహితుడికీ, శశికి కాబోయే వియ్యపురాలికీతప్ప శశిమొగుడుతోనే లేచిపోయిందని ఎవరికీ తెలీదు.

---

కథానిక

# ధర్మాత్ముడు

కూరపాటి శ్రీరాం

నెల రోజులు సెలవుపెట్టి ప్రకాశాన్ని చూద్దామని వాళ్ళ ఊరికి వెళ్ళాను. ప్రకాశం నన్ను చూడగానే "ఒరే, నువ్వట్రా? ఆఫీసరుగారికి మమ్మల్ని దర్శించడానికి సమయం ఇప్పుడు చిక్కిందన్నమాట!" అని అన్నాడు వ్యంగ్యంగా. "ప్రకాశం ఇప్పుడేవచ్చానా, కాస్సేపు రెస్టు తీసుకోనియ్యి. తర్వాత ప్రారంభించు నీ వేళాకోళాలు" అని నేను అనాల్సొచ్చింది.

భోజనంచేసి యిద్దరం సావధానంగా కూర్చున్నాము. నాకు వెంటనే రంగన్న జ్ఞాపకంవచ్చి "ప్రకాశం, ఇప్పుడు రంగన్న యేంచేస్తున్నాడ్రా? నేను వచ్చానని ఒకసారి కబురుచేద్దూ, పాపం, నేనంటే దేవుళ్ళాడుతూ వస్తాడు" అన్నాను. ప్రకాశం "రంగన్నకి కబురుచెయ్యనక్కర్లేదు. వాడీ ప్రపంచంలో లేడు. బకెట్ని కిక్ చేసేశాడు" అని అన్నాడు.

నాకూ చాలా ఆశ్చర్యం వేసింది. రంగన్న మా పొలంప్రక్కనే యీ వూళ్లో రెండెకరాల భూమిని దున్నుకుంటూ బ్రతికే మోతుబరి! మోతుబరి అని ఎందుకనాల్సివచ్చిందంటే—అతనికున్న భూమిని గురించి, అతని స్వాతంత్ర్యజీవిత లక్ష్యాన్ని గురించీ అటువంటి అతని స్వేచ్ఛాపిపాసే నన్ను అతనికి సన్నిహితుణ్ణిచేసింది.అతనంటే నాకదో విధమైన అభిమానం. అతనికి నేనంటే అమిత ప్రాణం; అధికగౌరవం. ఎప్పుడు ఈ వూరొచ్చినా నేనూ, వాడూ (నాకు అతనికిగల చనువుబట్టి అతనిని "వాడు" అనడం నాకు పరిపాటి) అలా పొలాలగట్ల మీంచి షికార్లు కొడుతూ అనేక విషయాలు మాట్లాడుకొనే వాళ్ళం. రెండెకరాల భూమికీ, తనకీ తప్ప ఈ ప్రపంచంలో రంగన్నకీ మరింకే వ్యక్తికీ నాకూ, వాడికీ ఉండేంత చనువు, అనుబంధంలేదని ఢంకామీద దెబ్బ కొట్టి చెప్పవచ్చును. అసలు నా యీడువాడే వాడుకూడా. అలాంటి నేనిలా నూట ఇరవై పౌన్లు తూగుతూ నిక్షేపంలా దుక్కలాగ ఉండటయేమిటి? రంగన్న చావడయేమిటి? చాలాఆశ్చర్యంగా ఉంది. దాంతో నాకు విసుగువేసి "ఏరాప్రకాశం! నువ్వనేదేమిటి? హాస్యమాడుతున్నావా? గంగన్న ఇప్పుడెక్కడుంటున్నాడ్రా అంటే వెధవ జవాబు చెప్తావేమిట్రా?" అన్నాను తీక్షణంగా.

వీరన్నకి వూరిలో 15 వేల రూపాయల కిమ్మత్తుచేసే ఇల్లుఉంది. అదికాక సేద్యం చేసే పొలం.అసలు వీరన్నకూ రంగన్నకూ నేనెరిగుండగా సంబధం యేమీవేదు. అలాంటప్పుడు రంగన్న చనిపోయాడంటూ నన్ను ప్రకాశం కంగారులో ఉంచడం నాకు మహా చిరాకెత్తించింది. అసలు సంగతి సవిస్తరంగా తెల్పమన్నాను ప్రకాశాన్ని.

ప్రకాశం మొదలెట్టాడు. "నీకు ఈ వూళ్లోని ధర్మారావుగారు తెలుసు కదూ! ఆయనే—ఆ పెద్ద మనిషే రంగన్నని చంపిస్త" ప్రకాశం ఒక లిప్త

ఊరుకున్నాడు. నా ఓర్మికి అవధులు దాటిపోయాయి. "ఒరేయి, జరిగిందేదో పూర్తిగాచెప్పు. ధర్మారావుగారేమిటి రంగన్నని చంపించడమేమిటి? ఆయనపై మీ వూరివాళ్ళకు దేముడిమీదఉన్నంత గురికన్న అధికంగా నమ్మకము, భక్తి శ్రద్ధలు ఉన్నపుడు— అలాంటి పెద్దమనిషి రంగన్ననిచంపుతాడా? అసలు రంగన్నలాంటి పేదరైతును చంపించడానికి జమీందారు ధర్మారావుగారి కవసరమేమిటి?ఇదినిజమా? వేళాకోళమా?"అన్నది ప్రశ్న.

"వేళాకోళంకాదు. ఇది నిజమని నువ్వుకాదు కదా, యెవరూ నమ్మరు. అంత అద్భుతమైన నేర్పు, చాకచక్యం ధర్మారావుగారిది. ఈ మధ్య అతనిలో ధనపిశాచము పూర్తిగా ప్రవేశించి అతని మానవత్వాన్ని, సహజశీల సంపదలనీ పూర్తిగా హరించివేసింది. ఎందరివో ఆస్తులు తనపరం జేసికొని అడిగిన వారికల్లా అవకతవక సమాధానాలు చెప్పి అందర్నీ నమ్మించసాగాడు ఆ పెద్దమనిషి.

మొన్న వీరన్న కాపుభార్యకి జబ్బుచేసింది. అది క్షయ అనీ, రెండువేల రూపాల ట్రీట్మెంటు మదనపల్లి శానిటోరియంలో యిప్పిస్తేగాని నయం కాదనీ తేల్చేరు ఇక్కడి వైద్యులు. "రాజరోగాలివి. మనం తట్టుకోలేము. నామాట విని పిల్లదాని పెళ్ళికానియ్యి. దాన్నిచూసి సంతోషిస్తూ సస్తా. రెండువేల రూపాయలంటే మాటలా? ఒద్దు ఒద్దు." అంది వీరన్నభార్య. ఎంతచెప్పినా వినకుండా వీరన్న కాళ్ళకి బలపం కట్టుకుని ప్రతిఇంటికీవెళ్ళి అప్పడిగాడు. రెండువేలు కావల్సొవచ్చేసరికి బంధువులంతా ముఖాలు త్రిప్పుకున్నారు.

వీరన్న ధర్మారావుగారి వద్దకువచ్చి పరిపరి విధాల అతడిని అడిగిచూచాడు. సమయంచూసి ధర్మారావు డబ్బులేదన్నాడు. "ప్రభువులు మీరే లేదంటే నాగతేంకావాలి బాబయ్యా? ఇంటి దీప మారిపోతుంటే కళ్ళప్పగించి చూస్తూ ఊరుకోట మెలా? బాబూ? అప్పిప్పించండి. నూటికి యాభై రూపాయలైనా వడ్డీ ఇచ్చుకుంటాను. వానదేవుడి చలవవలన గింజలువస్తే మీడబ్బు మీకు పువ్వుల్లో పెట్టిస్తా బాబూ, కరుణించండి" అన్నాడు వీరన్న.

ధర్మారావు అప్పటికి లేదని తర్వాత తాను బస్తీనుండి ఒక స్నేహితుడిద్వారా తెప్పించానని రెండువేలూ అతనికిచ్చాడు. భార్య జబ్బు నయమయింది. వీరన్న కృతజ్ఞతతో ఉప్పొంగిపోయాడు. ధర్మారావుగారు ధర్మాత్ములని ప్రజలకు మరియొకసారి చెరిపినా చెరగనంతటి నమ్మకము కలిగింది. ఈ సంఘటనతో అతడు సార్థక నామధేయుడని పొగిడింది ఊరు.

గిర్రున రెండేళ్లు తిరిగాయి. వచ్చిన గింజలు వీరన్న తిండికే చాలీచాలక పోయాయి. వీరన్నని ధర్మారావు తన బస్తీ స్నేహితుడు డబ్బుకోసరం తన్ను కంగారు పెడుతున్నాడనీ "వీరన్నా! సరిగ్గా ఇంకో ఆరునెల్లు గడువిస్తున్నాను. నాడబ్బు నాకిస్తేసరి. లేకపోతే అల్లరిపడాల్సొస్తుంది. ఇది నాధనమే అయితే నీకీ పరిస్థితుల్లో ఊరికేనే ఇచ్చేవాణ్ణి. కాని ఇక్కడ వంశమర్యాదలూ, వంశప్రతిష్ఠలూకూడా ఆలోచించాల్సి ఉంటుంది. బస్తీలో డబ్బు అప్పగించకపోతే నా మర్యాదా ప్రతిష్ఠలకి భంగం వాటిల్లబోతోంది వీరన్నా! నీపరిస్థితి తెలుసుండికూడా నేనిలా అడుగుతున్నానంటే నా స్నేహితుడు నన్నెంత తొందర పెడుతున్నాడో ఆలోచించు వీరన్నా! నిన్ను ఒత్తిడి చేస్తున్నందుకు నాకే సిగ్గేస్తోంది. కాని, పరిస్థితుల ప్రభావం అలాగుంటే నేను చేయగలిగే దేమిటి వీరన్నా!" అని ఒక చిన్న లెక్చరు దంచాడు.

వెంటనే వీరన్న "బాబ్బాబూ! మీరంత మాట నక్కర్లేదు బాబూ! మీ గడువు లోపల నాఅప్పు తీర్చుకుంటా బాబూ! మీకొక్క నాడుకూడా అపకీర్తి రాదుబాబూ!" అని కన్నీళ్ళతో కదలిపోయాడు అక్కడినుండి.

ఆరునెలలూకూడా గడిచేయి. వీరన్న 'జెంటిల్మెన్' కాబట్టీ, మాటపడే రైతుకాడు కాబట్టీ తన ఇంటిని ఖరీదు పెట్టాడు. అది దయ్యాలకొంప అని కొందరిచే చాటింపించాడు ధర్మారావు. తనే కొంటానన్నాడా ఇంటిని. అది దయ్యాలకొంప అని చాటడంవల్లనో లేక ధర్మారావే ఇల్లుకొంటాననడం వల్లనో ఊళ్ళో యింకెవరికీ దమ్ములేక పోయాయి బేరం పెట్టడానికి. ఎవరూ బేరానికి రాకబోవడంవలన వీరన్న వెలవెలాబోయాడు.

ధర్మారావు సమయంజూసి, "వీరన్నా, ఇంక చేసేదేముందిగనక? నాకెంత వరకు ప్రాప్తో అంత వరకే. సరే యేంచేస్తాను? నీఇంటిని నా అప్పుకింద జమకడుతున్నాను" అన్నాడు. "అదేంటిబాబూ!

పదేనువేల రూపాయల ఇంటిని రెండువేల అప్పుకి జమకడ్తారా? ఇదేం న్యాయం బాబూ? ధర్మాత్ములు, ధర్మపెబువులు మీరే అలాంగటే మరింక నేనేటి సేసేది బాబూ?" అని వీరన్న అన్నాడు గాద్గదికంగా.

"వీరన్నా! నీకు తెలీందేముంది? ఈ దయ్యాల కొంపని కొనడానికెవరూ ఒప్పట్లేదు. మరింక ఏం చేస్తాం? పోనీ నీస్థితి చూస్తే జాలేస్తోంది. ఈ వెయ్యిరూపాయిలూ తీసుకో. ఆ ఇల్లు జప్తు చేసుకుంటున్నాను." అన్నాడా(అ)ధర్మ ప్రభువు. "సరేబాబూ" అని మాత్రం వీరన్న అనగలిగాడు.

కూతురుకి పెళ్ళివయస్సు దాటిపోతుందనీ, వివాహం తొందరగా కానిమ్మని మొండిపట్టు పట్టింది వీరన్న భార్య. ఒకటికి రెండైంది కష్టాల సంఖ్య. చేసేదిలేక సంఘానికి తల వొగ్గాడా కాపు. చేతుల్లోధర్మారావుదానం వెయ్యిరూపాయలుతప్ప వేరే డబ్బేమీలేదు. మకాం తన మామ యింట్లో పెట్టి పెళ్ళిసంబంధంవెతికాడు వీరన్న తనకూతురికి.

అప్పుల్లో ఇల్లమ్ముకున్నవాడి కూతురికి సంబంధాలెక్కణ్ణించి వస్తాయి? ఇల్లు అమ్ముకోగానే చుట్టాలూ, పక్కాలూ మళ్ళీ వీరన్న ముఖంవైపు చూడకుండా మరలిపోయారు; చూస్తే వీరన్న తమనేమైనా అప్పడుగుతాడేమోనన్న భయంతో.

అప్పుడు రంగన్నను గురించి అతడు పూర్తిగా విన్నాడు. తల్లీ తండ్రీ లేకున్నా రంగన్న యేదో విధంగా కలో గంజో తాగుతున్నాడు కాబట్టి అతనికిచ్చి తనకుమార్తె వివాహం పూర్తిచేద్దామనుకున్నాడు. రంగన్నని పిలిచాడు. పిల్లను చూపెట్టాడు. బంగారు బొమ్మలాంటి పిల్లను చేసికోడానికి వెనుదీయలేదు రంగన్న. వీరన్న ఐదొందలు కట్నంక్రింద ఇస్తానన్నాడు. ఇచ్చాడు పెళ్ళి అయిందనిపించాడు వీరన్న.

కట్నం పైకంతో తన పొలంకేసి వెడుతున్న రంగన్నను దుడ్డుకర్రతో తలమీద ఎవరో ఒక దెబ్బవేశారు. డబ్బు కాజేశారు. రంగన్నప్రాణం గాలికెగిరి పోయింది. వీరన్న కుములి కుములి ఏడ్చాడు, డబ్బుపోయిందనికాదు; ముక్కులారని పిల్లకి ముద్దుముచ్చట్లు మూడురోజుల్లోనే ముగిసాయని. చేసేదేముంది? ఆస్థితిలో ధర్మారావే మరో రెండొందలు సహాయంచేశాడు ఉదారంగా.

చంపినవాడెవడో పోలీసుకు తెలియబరుస్తానన్నాడు ధర్మదేవత ధర్మారావు. "సచ్చినాడెలాగా సచ్చాడుబాబూ! కోర్టులకి తిరిగి ఇంకా మేము, మా వంశం తలెత్తుకోనీకుండా చేయకు బాబూ!" అని సంగతి అర్థంకాని వీరన్న వంశం మర్యాద అంటూ, అదేదో తనకింకా మిగిలుందనుకుంటూ మూలిగాడు.

ప్రకాశం ఆగాడు. "బావుందిరా ప్రకాశం! రంగన్నను ధర్మారావుగారే చంపారన్నందుకు నీకాధారమేమిటి? అలా ఉపకారంచేసినవాడిలా యెందుకు అపకారంచేస్తాడు?"అని నేనతన్ని సర్వసామాన్యంగా ప్రశ్నించాను.

"చూసేవురా బ్రదర్! ఇది నువ్వు కాదుకదా, మరెవ్వరూ కూడా ధర్మారావు పని ఇది అని నమ్మరు...ధర్మారావు వీరన్నకు పెళ్ళికని ఇచ్చిన పదివందల నోట్లనీ నేను చూసాను. సరిగ్గా అందులోని నెంబరు కలదాన్నే ఒకదాన్ని వీరన్నకు రంగన్న చనిపోయాక ఇచ్చాడు ధర్మారావు. అంటే అర్థమైందా అసలు సంగతి? ఆ నెంబర్లూ అవీ ఈ పల్లెటూరివాళ్ళకు అసలేమిటో తెలీవు. నేను నిన్న ధర్మారావు యెదురుగుండా రచ్చబండ దగ్గరరంగన్నచావు ప్రస్తావనతీసుకురాగాధర్మారావు వెలవెలాపోయి వెళ్ళిపోయాడు అక్కణ్ణించి. ఇంతకన్నా నీకు వేరే ఆధారంకావాలా? ధర్మారావుని అంతా ధర్మాత్ములూ, ఇతర్ల కష్టాలని కూడా చూడలేని దయార్ద్ర హృదయులు అని అనుకున్నారా ఘట్టంచూసి"అనిముగించాడు ప్రకాశం.

"నీకు తెలిసినపుడు రంగన్నని ధర్మారావే చంపించాడని చెప్పలేక పోయ్యావుట్రా?" అని నేను ప్రశ్నించాను ప్రకాశాన్ని. వాడొకనిముషం ఆగి, "ఒరే, అది నిరూపిస్తే నేను మళ్ళీ ఈ వూరినుంచి పయట పడ్డానికేనా ప్రాణంతో ఉండాలి కదరా!" అని సమాధానించాడు. "ఔను, ధర్మారావు లాంటి కుత్సితులైన ధర్మాత్ములుండి వారిని అమాయకులు నమ్మినంతవరకు మనలాంటి దుర్బలులు దాన్ని బయల్పర్చలేము. అదేమననీ, మన సంఘాన్ని అధోగతికి ఈడుస్తోంది" అని నేను అనకుండా ఉండలేక పోయాను. పోనీ ఇది నేనే బయల్పరుద్దామంటే ప్రకాశం దుర్బలత్వంలాంటి పిరికితనమే నన్ను మాట్లాడనీయకుండా చేసింది.